క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



ఘన జీవామృతం తయారు చేస్తున్న సిబ్బంది

జి.సిగడాం: సేంద్రియ ఎరువులు, ద్రావణాలు, కషాయాలతో వ్యవసాయం చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జి సంతోషికుమారి అన్నారు. శుక్రవారం దవళపేట పంచాయతీ విజయరాంపురంలో సంపత్‌రావు కామేశ్వరరావు ఆధ్వర్యంలో ఘన జీవామృతం తయారీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు లభించే సహజ వనరులను వినియోగించి బీజామృతం, ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, నీమాస్త్రం, వావిలాకు కషాయం, తూటికాడ కషాయం, బ్రహ్మాస్త్రం, అగ్నిఅస్త్రం, మారేడు పత్రం తదితర కషాయాలను తక్కువ ఖర్చుతోనే తయారు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్యకర్తలు బి.ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

ప్రార్థనా మందిరాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి



మాట్లాడుతున్న జె.ఆర్.పురం ఎస్‌ఐ చిరంజీవి

రణస్థలం: రణస్థలం, లావేరు మండలాల్లోని చర్చిల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని జె.ఆర్.పురం ఎస్‌ఐ ఎస్.చిరంజీవి నిర్వాహకులకు సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని డబ్ల్యూఎంఈ చర్చిలో రెండు మండలాల పాస్టర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మత విద్వేషాలు జరగకుండా ప్రతిఒక్కరూ సహకరించాలని సూచించారు. ఇటీవల జిల్లాలోని జరిగిన అన్యమత ప్రచారాల దృష్ట్యా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు, మతపెద్దలు, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



దుర్గాదేవి ఆలయంలో సీసీ కెమెరాల ఏర్పాటును పరిశీలిస్తున్న ఎస్‌ఐ

జి.సిగడాం: గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని జి.సిగడాం ఎస్‌ఐ వై.మధుసూదనరావు హెచ్చరించారు. శనివారం పెంట గ్రామంలో పలు దేవాలయాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మహిళలు బంగారు ఆభరణాలు ధరించినప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహనచోదకులు అన్ని ధ్రువపత్రాలు కలిగి ఉండాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సచివాలయ మహిళా పోలీసుల పైల అనసూయమ్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆదర్శవంతుడు భరతుడు



హరనాథరావును సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: భరతుడిది త్యాగ గుణమని వక్త పైడి హరనాథరావు అన్నారు. నగరంలోని ఉపనిషన్మందిరంలో జరుగుతున్న శ్రీరామ వసంత నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 'భరతుని భాతృభక్తి' అనే అంశంపై శనివారం ప్రసంగించారు. వైరాగ్య, సత్య, ధర్మ, తపః, క్షేమ, దయ సౌమ్య గుణాలు రామాయణంలో అడుగడుగునా సాక్షాత్కారమవుతాయని వివరించారు. కార్యక్రమంలో మందుల మోహనరావు, పెంట శ్రీధర్‌శర్మ, కోమల రావు, నరసింహమూర్తి, వెంకటరమణ, సనపల నారాయణమూర్తి, సూర్యారావు, కామేశ్వరరావు, విశ్వేశ్వరరావు, అరుణకుమారి, జగదాంబ, సీత, లక్ష్మీ పాల్గొన్నారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు



మొండేటివీధిలో అలంకరణలో వెంకటేశ్వరస్వామి

శ్రీకాకుళం కల్చరల్ : నగరంలోని చిన్నబజారు దూదివారి వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వామివారిని తులసి మాలలతో అలంకరించారు. అర్చకులు రేజేటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి అష్టోత్తర శతనామాలతో అర్చనలు చేశారు. మొండేటివీధిలోని వేంకటేశ్వర దేవాలయంలో అర్చకులు పట్నాల రామకృష్ణ శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, అష్టోత్తర శతనామాలతో పూజలు జరిగాయి. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు.

తవ్వకాల్లో తగ్గేదేలే..!

- వంశధార నదీ పరివాహకంలో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు
- మల్లికార్జున స్వామి ఆలయానికి పొంచి ఉన్న ముప్పు
- అనుమతులకు మించి రవాణా
- పట్టించుకోని అధికారులు



బైరిలో నదీ తీరానికి ఆనుకుని ఉన్న మల్లికార్జున స్వామి దేవాలయమిదే..

శ్రీకాకుళం రూరల్: ఉచిత ఇసుక విధానం పేరిట కొందరు ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపడుతున్నారు. అనుమతులకు మించి రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆలయాలు వంటి కట్టడాలకు ముప్పు వాటిల్లుతున్నా వెనక్కి తగ్గడం లేదు. శ్రీకాకుళం రూరల్ మండలం బైరి, కరజాడ పరిసర ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలు నిత్యం చేపట్టడంతో వ్యవసాయ బోరులు సైతం పాడైపోయాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. వాస్తవంగా ఇక్కడ ఇచ్చిన అనుమతులు కన్నా 30 అడుగులు మేర ఇసుక తవ్వకాలు చేపట్టడంతో బైరి గ్రామాన్ని అనుసరించి వంశధార నదీ పక్కనే గల మల్లికార్జున స్వామి ఆలయానికి ప్రమాదం పొంచి ఉంది. రాత్రింబవళ్లు తవ్వకాలు సాగుతుండటంతో ఆలయానికి ఆనుకొని ఉన్న ఇసుక మేటలన్నీ నేల మట్టమయ్యాయి. మరింత ఎక్కువగా తవ్వితే ఆలయం కూడా కూలిపోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గ్రానైట్ పలకలతో ర్యాంప్..

బైరి ర్యాంప్‌ను ఆనుకొని ఏకంగా నదీ గర్భంలోకే గ్రానైట్ పలకలతో కూడిన ర్యాంప్‌ను రోడ్డు మాదిరిగా వేసేశారు. దీనిమీదుగా భారీ వాహనాలు వెళ్తూ దర్జాగా ఇసుక లోడింగ్ చేసుకుంటున్నారు. వాస్తవానికి కూలీల సహాయంతో తట్టలతో వాహనాల్లోకి ఇసుక నింపాల్సి ఉండగా ఇక్కడ మాత్రం 200 హైస్పీడ్ ప్రొక్లెయిన్ మిషన్లను వినియోగించి భారీ మొత్తం ఇసుక డంపింగ్ చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



వంశధార నదిలోకి ర్యాంపు వద్దకు వేసిన రోడ్డు

పొంచి ఉన్న ప్రమాదం



మా గ్రామస్తులమంతా కొలిచే మల్లికార్జున దేవాలయానికి ప్రమాదం పొంచి ఉంది. ఎగువ ప్రాంతంలో తవ్వకాలు చేపట్టడంతో ఆలయానికి ఆనుకొని ఉన్న ఇసుక మేటలన్నీ నదీ గర్భంలోకి కూరుకుపోతున్నాయి.

– ఎండి అసిరినాయుడు, ఉప సర్పంచ్, బైరి గ్రామం

భారీ వాహనాలతో..



మా గ్రామానికి ఇసుక ర్యాంప్ వచ్చినప్పటికీ మాలాంటి వారికి పని కల్పించకుండా పెద్ద పెద్ద వాహనాలతో ఇసుక తోడేస్తున్నారు. తట్టలతో పనిచేసే మాలాంటి కూలీలకు ర్యాంపులో పనిదొరకడం లేదు.

– లక్ష్మణరావు, బైరి గ్రామం

తవ్వకాలు వాస్తవమే..

బైరి ప్రాంతంలో ఇసుక తవ్వకాలు జరగడం వాస్తవమే. శ్రీ వెంకటేశ్వర మైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్ వారు తవ్వకాలు నిర్వహిస్తున్నారు. నదిలోకి నేరుగా తాత్కాలిక రోడ్డు వేశారు. ఇచ్చిన అనుమతులు కన్నా ఎక్కువగానే తవ్వుతున్నట్లు మా దృష్టికి వచ్చింది.

– యాళ్ల లక్ష్మణరావు, బైరి వీఆర్‌ఓ

మహిళలు అప్రమత్తంగా ఉండాలి



మహిళల భద్రతపై మాట్లాడుతున్న సీఐ త్రినేత్రి

ఎచ్చెర్ల క్యాంపస్: ఉద్యోగాలు, ఉన్నత చదువులు చదివే మహిళలు తమ రక్షణ పట్ల అప్రమత్తంగా ఉండాలని శక్తి టీం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ త్రినేత్రి అన్నారు. శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) ఎస్ఎంపురం క్యాంపస్‌లో శనివారం మహిళల భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే అత్యవసర సమయాల్లో రక్షణ పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో డైరెక్టర్ కె.వి.జి.డి.బాలాజీ, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, సీఐ రవికుమార్, డీన్‌లు శివరామ కృష్ణ, గేదెల రవి, ఫైనాన్స్ అధికారి వాసు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏలకు ఇసుక పాట్లు



కోష్ట సమీపంలో నిల్వ ఉంచిన ఇసుక

రణస్థలం: కలెక్టర్ ఆదేశాలతో ఫిబ్రవరి 14న పైడి భీమవరం చెక్‌పోస్టు వద్ద రెవెన్యూ అధికారులు 12 అక్రమ ఇసుక లారీలు పట్టుకున్న సంగతి తెలిసిందే. ఆ ఇసుకను కోష్ట గోశాల సమీపంలో నిల్వ ఉంచి వీఆర్‌ఏలను కాపలా ఉంచారు. అప్పటి నుంచి రాత్రింబవళ్లు అక్కడే ఉండాల్సి వస్తోందని, ఎటువంటి సదుపాయం లేక రాత్రిపూట దోమల బెడద ఎక్కువగా ఉందని సిబ్బంది వాపోతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ ఎస్.ప్రసాద్ వద్ద ప్రస్తావించగా హౌసింగ్ పీడీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలు, ఉన్నతాధికారులకు తెలియజేశామని చెప్పారు.

పాస్టర్స్ ఫెలోషిప్ కార్యవర్గం ఎన్నిక



నూతన కమిటీ ప్రతినిధులు

రణస్థలం: రణస్థలం, లావేరు మండలాల పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు బిషప్ డీఎస్‌వీఎస్ కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని డబ్ల్యూఎంఈ చర్చి ఆవరణలో శనివారం సమావేశం నిర్వహించారు. 2025–27 సంవత్సరాలకు గాను అధ్యక్షుడిగా ఎం.తిమోతి, గౌరవాధ్యక్షులుగా సీహెచ్ రూబేన్, ఉపాధ్యక్షులుగా ఎం.జక్కయ్య, కార్యదర్శిగా ఎం.ఇశ్రాయేలు, ఉపకార్యదర్శిగా ఎ.ఆర్.రెడ్డి, ట్రెజరర్‌గా వి.సురేష్, జాయింట్ ట్రెజరర్‌గా జి.జోషిబాబు, కార్యవర్గ సభ్యులుగా డి.రత్నం, యేసుదాసు, ఎం.సైలస్, బి.శామ్యేల్‌రాజు, సలహాదారులుగా సీహెచ్ సుధాకర్, వి.యేసురత్నం, జి.ఎస్.పాల్, ఎస్.శ్యాంకుమార్‌లను ఎన్నుకున్నారు.

సామాజిక పోరాటయోధుడు బాబూ జగ్జీవన్‌రామ్

అణగారిన వర్గాల ఆశాజ్యోతి, దళిత హృదయాల్లో నిండిన తేజోకాంతి బాబూ జగ్జీవన్‌రామ్ అని పలువురు వక్తలు కొనియాడారు. మాజీ ఉప ప్రధాని, సామాజిక పోరాట యోధుడు జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా శ్రీకాకుళం, ఎచ్చెర్ల నియోజకవర్గాల వ్యాప్తంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. – సాక్షి నెట్‌వర్క్



శ్రీకాకుళం రూరల్: నియోజకవర్గ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి అంజలి ఘటిస్తున్న మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, నాయకులు



శ్రీకాకుళం అర్బన్: అరసవల్లి మిల్లు జంక్షన్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే, కలెక్టర్ తదితరులు



శ్రీకాకుళం అర్బన్: జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు



శ్రీకాకుళం పాతబస్టాండ్: కలెక్టరేట్‌లో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఉప కలెక్టర్ పద్మావతి, అధికారులు



శ్రీకాకుళం క్రైమ్: జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న అదనపు ఎస్పీ కె.వి.రమణ



శ్రీకాకుళం న్యూకాలనీ: జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎస్‌ఎల్‌టీపీ నాయకులు వసంతరావు, మేరీప్రసాద్



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జ్యోతిరావుపూలే పార్కులో నివాళులు అర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు



శ్రీకాకుళం న్యూకాలనీ: హయాతినగరంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గురుకుల ప్రిన్సిపాల్ జస్వరాజ్యలక్ష్మి



రణస్థలం: జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్ సీపీ నేత పిన్నింటి సాయికుమార్



ఎచ్చెర్ల క్యాంపస్: అంబేడ్కర్ వర్సిటీలో జగ్జీవన్ రామ్‌కు నివాళులు అర్పిస్తున్న అధికారులు

గూడ్స్ రైలును తలపించేలా..



రణస్థలంలో జాతీయ రహదారిపై భారీ పరిశ్రమల పరికరాలతో ఒకేసారి వాహనాలు వెళ్లడంతో ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బిలాయి సిప్లెక్స్ పరిశ్రమలో తయారైన వీటిని విశాఖపట్నంలోని పరిశ్రమకు తీసుకెళ్తున్నట్లు డ్రైవర్లు తెలిపారు.

– రణస్థలం

వైభవంగా సీతారాముల రథోత్సవం



నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనిలో సత్యం, శివం, సుందరం మందిరంలో ఆదివారం జరగనున్న శ్రీరామ నవమి ఉత్సవాల నేపథ్యంలో సీతారాముల విగ్రహాలతో శనివారం రథోత్సవం నిర్వహించారు. రామోత్సవాలను విజయవంతం చేయాలని కోరుతూ ఇంటింటికీ వెళ్లి ఆహ్వాన పత్రికలు పంపిణీ చేశారు. సత్యసాయి మందిరం కన్వీనర్, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు



బలగ హరేరామ మందిరం వద్ద శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకుని అర్చకులు చెరువు నారాయణ రావు ఆధ్వర్యంలో శనివారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆదివారం జరిగే సీతారామచంద్రమూర్తుల కల్యాణ వేడుకలు విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



కళాకారులను సత్కరిస్తున్న నిర్వాహకులు



నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

శ్రీకాకుళమ కల్చరల్: స్థానిక బాపూజీ కళామందిర్‌లో రంగస్థల కళాకారుల 306వ నెలవారీ సాంస్కృతిక కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. విరంచి నృత్యకళానికేతన్ దర్శకులు అనురాధ ఆధ్వర్యంలో భరతనాట్యం, కూచిపూడి, జానపదం, కోలాటం ప్రదర్శనలు ఆద్యంతం అలరించాయి. సభాధ్యక్షుడు ఎల్.రామలింగస్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన స్వాతీ సోమనాథ్, కొమ్మల తవిటయ్య, ఎస్.వి.భాస్కరరావులు మాట్లాడుతూ ప్రతి నెలా పేద కళాకారులకు పింఛను రూపంలో సాయం అందించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో పన్నాల నర్సింహమూర్తి, బి.రామచంద్రదేవ్, పొట్నూరు వెంకట్రావ్, సత్యవతి, కలగ గణేష్‌యాదవ్, జ్యోతి, ఐ.రమణారావు, అగతమూడి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణం చూతము రారండి



చంపాగల్లివీధిలో సీతారాములు



మంగువారితోటలోని రామ్ నగర్ వద్ద ఏర్పాట్లు



బలగ హరేరామ మందిరం వద్ద ఏర్పాట్లు



కోదండ రామాలయం వద్ద ఏర్పాట్లు



నక్కవీధిలో విద్యుత్ అలంకరణలో రామమందిరం



ఎచ్చెర్ల క్యాంపస్: పోలీస్ క్వార్టర్స్‌లోని కోదండ రామాలయం

శ్రీరావనవమి సందర్భంగా శ్రీకాకుళం, ఎచ్చెర్ల నియోజకవర్గాల వ్యాప్తంగా రామాలయాలు ముస్తాబయ్యాయి. విద్యుద్దీప అలంకరణలతో కాంతులీనుతున్నాయి. పచ్చని పందిర్లతో శోభాయమానంగా దర్శనమిస్తున్నాయి. ఆదివారం జరిగే సీతారాముల కల్యాణ వేడుకలకు వేదికలు సిద్ధమయ్యాయి. ఎండ నేపథ్యంలో భక్తులు ఇబ్బందులకు గురికాకుండా పలుచోట్ల టెంట్లు వేశారు.

– శ్రీకాకుళం కల్చరల్